కొండపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ

క్రీడలతో మానసికోల్లాసం

పెంచికల్‌పేట్, జనవరి 2 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్సై కొమరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొండపల్లిలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ సంజీవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. క్రీడలతో మానసికో ల్లాసం తో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, మనోధైర్యం కూడా పెరుగుతుందన్నారు. ఎలాంటి విభేదాలు లేకుండా విజ యవంతంగా ముగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పరదేశి ,సుధాకర్ యువకులు నారాయణ ,శ్రీనివాస్,లచ్చన్న, రమేశ్, క్రికెట్ నిర్వహణ యూత్ పాల్గొన్నారు.

వేధిస్తున్న కూలీల కొరత

చేనులోనే ఉన్న పత్తి పంట

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి : జిల్లాలోని పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తున్నది. పత్తి ఏరడానికి కూలీలు దొరకక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి మద్దతు ధర సైతం తక్కువ ఉంది. దీంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు కూలీలు దొరకకపోవడంతో పత్తి చేళ్లలోనే మగ్గిపోతున్నది. ఇలా ఎక్కువ రోజులు ఉంటే పంట బరువు తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

కాగజ్‌నగర్, డిసెంబర్ 2: ఎయిడెడ్, సమగ్ర శిక్ష, కేజీబీవీ, ఆశ్రమ, పాఠశాలలు, మైనార్టీ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, ప్రధానకార్యదర్శి ఇందురావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వేతనాలు సరైన సమయంలో అందకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. ప్రతినెల 5 లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావుకు ప్రతినిధ్యం చేసినప్పటికీ ఇప్పటి వరకు వేతనాలు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. వేతనాలు అందక రెండు నెలలుగా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేజీబీవీ, గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అందించాల్సి ఉన్నప్పటికీ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రజాపాలన పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 2: ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ (స్థానిక సంస్థలు) అన్నారు. మంగళవారం మండలంలోని ఈదులవాడ గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎంపీపీ మల్లికార్జున్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎవరూ కూడా బయట డబ్బులు పెట్టి దరఖాస్తు ఫారాలను తీసుకోవద్దని, ప్రభుత్వం వాటిని ఉచితంగా అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారంటీల పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, సర్పంచ్ రుషి భిమేశ్ తదితరులు పాల్గొన్నారు.

• కెరమెరి మండలంలో

కెరమెరి, జనవరి 2: మండలంలోని నాగల్‌గొంది గ్రామంలో మంగళవారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5 గ్యారంటీ సంక్షేమ పథకాల అమలుపై ఎంపీడీవో మహేందర్ ప్రజలకు వివరించారు. ఇంటి యజమాని ఫొటోతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డుల జిరాక్స్‌తో కావాల్సిన సంక్షేమ పథకాలను ఎంపిక చేస్తూ దరఖాస్తు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గేడం మధుకర్, ఏపీవో మల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, ఏఈవో అఖీల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

• నేడు ప్రజాపాలన గ్రామసభలు

రెబ్బెన, జనవరి 2: మండలంలో కొనసాగుతున్న ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాసిగాం, లక్ష్మిపూర్, తుంగెడ, మదావాయిగూడ గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సమీర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తు ఫారానికి ఫొటో అంటించి ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు జత చేసి కౌంటర్‌లలో అందించి రసీదు తీసుకోవాలని పేర్కొన్నారు.

• పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టీ), జనవరి 2 : నిరుపేదల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, సిర్పూర్(టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన సభల్లో ప్రజలు అందించే అన్ని రకాల దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. అనంతరం మండలంలోని ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన కలాణ్యలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చునార్కర్ సువర్ణ, జడ్పీటీసీ నీరటి రేఖ, డీఎల్‌పీవో సురేశ్ బాబు, మండల ఉపాధ్యక్షుడు ఈర్త సత్యనారాయణ, ఎంపీటీసీలు సుహేల్ అహ్మద్, మంగీలాల్, సర్పంచ్ తఫిమా పర్విన్, ఎంపీడీవో రాజేశ్వర్, మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

• చింతలమానేపల్లి మండలంలో..

చింతలమానేపల్లి,జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని బాబాసాగర్, రవీంద్రనగర్-2 గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నాన య్య ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మస్కూర్ అలీ, కోఆప్షన్‌సభ్యుడు నాజీం హుస్సేన్, సర్పంచ్‌లు కత్తెర్ల సుశీల, సుశీల్ మండల్ నాయకులు ఎల్ములే మల్లయ్య, డుబ్బుల మురళీ, ధోని శ్రీశైలం, తుకారాం, తిరుపతిగౌడ్, చౌదరి నవీన్, కొంపరి రమేశ్, మోహన్, పరేష్‌రాయ్, రమేశ్ పాల్గొన్నారు.

• వాంకిడి మండలంలో..

వాంకిడి,జనవరి 2 : అర్హులైన లబ్ధిదారులందరూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివ కుమార్ సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిచ్చుపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ అధ్యక్ష తన మగళవారం గ్రామసభ నిర్వహించారు.ఈసభకు ముఖ్య అతిథిగా ఆయన హాజై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలోని 6గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకొని ఈ పథకాలను సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

• అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

దహెగాం,జనవరి 2 : ప్రజాపాలన గ్రామసభల్లో అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ దామెర కవిత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దహెగాం,కమ్మర్‌పల్లి, గెర్రె, గిరివెల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ఉద్దేశాలను వివరించారు. అదేవిధంగా గ్యారంటీలకు చెందిన దరఖాస్తులను అందజేశారు. ఈ నెల 6వరకు గ్రామ సభ లు నిర్వహిస్తామని, అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పుప్పాల లక్ష్మి, జర్పుల శ్యామల, సందికట్ల రమేశ్, కారు రాజన్న, అధికారులు పాల్గొన్నారు.

• కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

జైనూర్,జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతున్నది. మంగళవారం మండలంలోని 26 గ్రామపంచాయతీల్లో సంబంధిత అధికారులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రభుదయ, తహసీలదార్ తిరుపతి, ఆర్ఐ సుధాకర్‌లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సిర్పూర్(టీ): లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

దహెగాం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్

ముమ్మరంగా వరి నాట్లు

దహెగాం: లగ్గాంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

దహెగాం, జనవరి2 : మండలంలో ముమ్మరంగా రైతులు యాసంగి వరి నాట్లు వేస్తున్నారు.గత కేసీఆర్ సర్కార్ వ్యవసాయమే అభివృద్ధిగా భావించి వ్యవసాయినికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో రైతులకు ఉన్న బీడు భూములను పొలాలుగా తయారు చేసుకొని బోర్లు వేసుకున్నారు. దాంతో గత 10 సంత్సరాల నుంచి మండలంలో వ్యవసాయం దినదినాభివృద్ధిగా సాగింది. దీంతో ఎటు చూసినా పచ్చని పొలాలుగా మారాయి.గత ఖర్ఫీ సీజన్‌లో సుమారుగా ఆరు వేల ఎకరాల్లో వరిసాగు చేసిన రైతులు ఈ యాసంగిలో కూడా ఏమాత్రం తగ్గకుండా బోరుబావుల కింద సాగును చేపట్టుతున్నారు.ప్రస్తుతం ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు

వృత్తి నైపుణ్యం మెరుగుపర్చేందుకే పరేడ్

రెబ్బెన : గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న అటవీశాఖ అధికారులు

రెబ్బెన , జనవరి 2: వృత్తి నైపుణ్యం మెరుగుపర్చేందుకే నెలలో రెండుసార్లు అటవీశాఖ అధికారులకు పరేడ్ నిర్వహిస్తున్నామని అటవీశాఖ రెబ్బెన రేంజ్ ఆఫీసర్ నిజాముద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని గోలేటిటౌన్‌షిప్‌లోని శ్రీ భీమన్న క్రీడామైదానంలో మంగళవారం రెబ్బెన రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులకు పరేడ్‌లో భాగంగా మార్చ్‌ఫాస్ట్, సెల్యూట్, కధాంధాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ మాట్లాడుతూ.. 15 రోజులకు ఒకసారి పరేడ్ నిర్వహించడం వల్ల అధికారుల్లో నూతనోత్తేజం వస్తుందని, రెట్టించిన ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారన్నారు. అటవీ సంరక్షణ కోసం కృషి చేసే అటవీశాఖ అధికారులు నిరంతరం వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీధరచారి, ఎఫ్ఎస్‌వోలు అత్రం రవీందర్, సతీశ్ , రవి, కోమ్మాలు, బాబు, బీట్ ఆఫీసర్‌లు భుక్య రవి, మధుకర్, సద్దాం, దేవేందర్, మనోహర్, స్వాతి, స్వర్ణలత, ఉషారాణి లు ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మెంగుబాయిగూడలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి మురళీకృష్ణ

- పశువైద్యాధికారి మురళీ కృష్ణ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 2 : పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్య అధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని మెంగుబాయి గూడలో నాబార్డు వారి ఆర్థికసాయంతో వాసన్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పశువులు వ్యాధుల బారినపడినప్పుడు ఆసిఫాబాద్ పశు వైద్యశాలను సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పశువులకు గాలికుంట వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఇక్కడ పశు వైద్య సిబ్బంది పురుషోత్తం, ప్రశాంత్, వాసన్ ఆర్గనైజేషన్ సిబ్బంది జయవర్ధన్, భీందాస్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

పైకాజీగూడలో నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

రెబ్బెన, జనవరి 2: మండలంలోని పైకాజీగూడ గ్రామానికి చెందిన ఓ పేద కుటుంబానికి ఎస్ఐ ఎస్ఐ చంద్రశేఖర్ నిత్యావసర సరుకులు అందజేశారు. మంగళవారం విధుల్లో భాగంగా పైకాజీగూడ గ్రామాన్ని సందర్శించగా సునార్కర్ వినోద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వినోద్ కుటుంబం పేద కుటుంబం అని తెలిసి వారికి నిత్యావసర వస్తువులు అందించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

కబడ్డీలో ఆదిలాబాద్ జట్టుకు మొదటి బహుమతి



సిర్పూర్(యు): బహుమతులు అందజేస్తున్న పటేల్‌గూడ గ్రామపటేల్ కొడప గంగారాం

సిర్పూర్(యు) జనవరి 2 : మండలంలోని పటేల్‌గూడలో కొడప బాపురావ్ పటేల్ స్మారక కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో మూడు రోజుల నుంచి రసవతరంగా కొన్నసాగుతున్న కబడ్డీ పోటీలు సొమవారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో మెదటి బహుమతి రూ.11 వేలు ఆదిలాబాద్ జట్టు, రెండో బహుమతి రూ.7 వేలు జారుగూడ, మూడో బహుమతి రూ.4 వేలు గెలుపొందిన వారికి పటేల్‌గూడ గ్రామ పటేల్ కొడప గంగారాం బహుమతులు అందజేశారు. సర్పంచు పద్మారాజేశ్వర్, ఆత్రం అనంద్‌రావ్, మెస్రం శ్రీరామ్, పీడీలు ఆత్రం ధర్మరావ్, హోనాజీ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now
★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319403-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
సంప్రదించండి: 91827 77676, 91827 77679
ఇతర: 91827 77671, 91827 77677

ఘనంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర

చింతలమానేపల్లి , జనవరి 2 : అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్రను భక్తులు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. భక్తులు మంగళవారం మండల కేంద్రంతో పాటు కర్జవెల్లి గంగాపూర్ గ్రామాల్లో అయోధ్య రామ్ లీలా మందిర పూజిత అక్షింతలను గ్రామంలోని ఇంటింటికీ వితరణ చేశారు. ముందుగా భాజాభజంత్రీలు నడుమ మహిళలు మంగళ హారతులతో సీతారాముల పల్లకీతో పాటు వాడ వాడలా శోభాయత్ర నిర్వహించారు.

• అయోధ్య అక్షింతల పంపిణీ

కాగజ్‌నగర్, డిసెంబర్ 2 : ప్రతి ఇంటికి అయోధ్య రాములవారి అక్షింతలు పంపిణీ చేస్తామని విశ్వహిందూపరిషత్ జాతీయ జాయింట్ సెక్రటరీ స్థాను మలయన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి యాదిరెడ్డి పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో తన నివాసంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుకు మంగళవారం అయోధ్య అంక్షింతలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివవాస్, కోశాధికారి అరుణ్ కుమార్ లోయ, భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్, నాయకులు రంగస్వామి, శుభం లోయ, ప్రణయ్ పాల్గొన్నారు.

కౌటాల : అయోధ్య అక్షింతలతో పల్లకీ సేవా నిర్వహిస్తున్న భక్తులు

• కుకుడలో..

బెజ్జూర్, జనవరి 2 : మండలంలోని కుకుడలో మంగళవారం ఇంటింటికీ అయోధ్య పూజిత అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు సోమవారం సాయంత్రం అందరూ ఇళ్లలో ఉండి అక్షింతలు స్వీకరించాలని డప్పు చాటింపు చేశారు. మంగళవారం సాయంత్రం అక్షింతలతో పల్లకి సేవా నిర్వహించారు. ఇళ్లలో ఉన్న మ హిళలు మంగహారతులతో భక్తులకు స్వాగతం పలుకగా భక్తులు అక్షింతలను ప్రతి ఇంటికి అందజేశారు.

• అయోధ్య అక్షింతల పల్లకీ సేవ

కౌటాల, జనవరి 2: అయోధ్య శ్రీరాముని ఆలయ అక్షింతల పల్లకీ సేవా కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తలోడి హనుమాన్ ఆలయ నుంచి మినీస్టేడియం వరకు అక్షింతలతో పాటు శ్రీరాముని విగ్రహంతో శోభాయాత్రను కొనసాగించారు. ఈ అక్షింతలను కోదండరామాలయంలో ఉంచి భక్తులకు ఇంటింటా తిరిగి అక్షింతలతో పాటు ఆహ్వాన పత్రికలను అందించనున్నట్లు శ్రీరామ క్షేత్ర కమిటీ సభ్యులు తెలిపారు.

అయోధ్య రాములవారి అక్షింతలు అందిస్తున్న బీజేపీ నాయకులు

చింతలమానేపల్లి: కర్జవెల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కౌటాల, జనవరి 2 : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో మంగళవారం కౌటాల శాఖ నిర్వహణాధికారి నరసింహస్వామి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భద్రతా పథకాలైన ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, పథకంలో ఏడాదికి రూ.20 లు చెల్లిస్తే రూ.2 లక్షల బీమా ఉంటుందన్నారు. అదేవిధంగా ఆయా వయస్సుల వారు ఇతర బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బ్యాంకు సేవలను సైతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ రాజేశ్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, బ్యాంకు వినియోగదారులు పాల్గొన్నారు.

కౌటాల : మాట్లాడుతున్న శాఖ నిర్వహణాధికారి

శబరికి తరలిన అయ్యప్ప దీక్షాపరులు

రెబ్బెన, జనవరి 2 : మండలంలోని పలువురు అయ్యప్ప దీక్షాపరులు మంగళవారం అయ్యప్ప స్వామి దర్శనం కోసం తరలి వెళ్లారు. గోలేటిటౌన్‌షిప్ కార్మిక కాలనీలో గల శ్రీ కోదండ రామాలయంలో 40 రోజులు అయ్యప్ప దీక్షను పూర్తి చేసుకొని మంగళవారం ఇరుముడి కట్టుకొని శబరికి పయణమయ్యారు. తరలిన వారిలో గురుస్వామి జిల్లాల నాగులు, లేకూరి సుధాకర్, జుమ్మిడి ప్రకాశ్, ముద్దం మహేందర్, జిల్లాల సత్యనారాయణ, సప్త శ్రీనివాస్ ఉన్నారు.

అన్నదానం

హనుమాన్ ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

సిర్పూర్(టీ), జనవరి 2 : మండలంలోని బెంగాళీ క్యాంప్ అటవీ ప్రాంతంలో స్వయంగా వెలసిన గుట్ట హనుమాన్ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గుట్ట హనుమాన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో మూడు సంవత్సరాలుగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని యువకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎమ్మెల్యే ను కలిసిన నాయకులు

కాగజ్‌నగర్, డిసెంబర్ 2: కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుకు పట్టణ పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలీ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు గడదా సు నారాయణ, సంఘం ప్రతినిధులు రాజయ్య, సదానందం, రవికుమార్, వెంకటి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.